ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 16 అక్టోబరు 2025 | 7



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఆకర్షణగా కేరళ కథాకళి నృత్యం..
(పక్కన) చంద్రప్రభ వాహనంపై శ్రీవారి ఊరేగింపు దృశ్యం



సమ్మోహినీ రూపుడై... 8

» సూర్య ప్రభ, చంద్ర ప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు.. వాడపల్లిలో ఆరో రోజుకు బ్రహ్మోత్సవాలు

'ఆయుర్వేదం' ఆగయా!



» కాకినాడకు ఆయుర్వేద కాలేజీ మంజూరు చేసిన కేంద్రం
» రూ.16 కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్న ఆయుష్ శాఖ
» జీజీహెచ్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 50 పడకల ఆసుపత్రిలోనే ఏర్పాటు
» అక్కడే కాలేజీ నిర్మాణానికి రెండెకరాలు కేటాయించాలని కోరిన కేంద్రం
» 8 స్పెషాలిటీ కోర్సుల్లో 50 సీట్లతో మొదలుపెట్టి 100 సీట్ల వరకు అప్‌గ్రేడ్
» ఆయుర్వేద కాలేజీ రాకతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ఎంతో మేలు
» ప్రస్తుతం రాష్ట్రంలో తిరుపతి, విజయవాడలోనే ఆయుర్వేద కళాశాలలు

కాకినాడ సిగలో మరో వైద్య కళాశాల అందుబాటులోకి రాబోతోంది. ఆయుర్వేద వైద్యానికి డిమాండ్ నెలకొన్న తరుణంలో కాకినాడలో ఆయుర్వేద కాలేజీని మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ విభాగానికి సమాచారం అందించింది. రూ.16 కోట్ల వరకు ఖర్చయ్యే కాలేజీ ఏర్పాటుకు రెండెకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ఎంతో మేలు జరగనుంది. ఎంబీబీఎస్ తరహాలోనే నీట్ ద్వారా ఆయుర్వేద కాలేజీలకు అడ్మిషన్ లభిస్తుంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఆయుర్వేద వైద్యానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. అనేక ముదిరిపోయిన వ్యాధులను సైతం నయం చేస్తుందనే ప్రచారం దీనికి ఉంది. ఈనేపథ్యంలో దేశంలో వేల ఏళ్ల కింద ఉద్భవించిన ఈ వైద్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుర్వేద ఆసుపత్రులు, కాలేజీలను నిర్వహిస్తోంది. అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఉచితంగా, నామ మాత్రపు రుసుములతోను చికిత్సలు అందిస్తున్నారు. అందులోభాగంగా కాకినాడకు సైతం ఆయుర్వేద ఆసుపత్రిని కేంద్రం మంజూరుచేసింది. రూ.17 కోట్లతో దీన్ని కాకినాడ జీజీహెచ్ ఆవరణలో 50 పడకల సామర్థ్యంలో నిర్మించారు. ఇక్కడ హోమియో, యోగా, యునానీ, ఆయుర్వేద చికిత్సలు అందించేలా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మాణం పూర్తి చేశారు. అయితే దీనికి అవసరమైన వైద్యుల నియామకం పూర్తి కాకపోవడంతో ఇంకా ఇది ప్రారంభం కాలేదు. అయితే ఉమ్మడి జిల్లాకు ఆయుర్వేద కాలేజీ అవసరాన్ని గుర్తించి గతేడాది కూటమి ప్రభుత్వం రాగానే అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపించారు. కొత్తగా ఆయుర్వేద మెడికల్ కాలేజీలను మంజూరు చేసే అవకాశం ఉండడంతో కాకినాడకు కొత్త కాలేజీ ఇవ్వాలని ప్రతిపాదనల్లో వివరించారు. పైగా ఇక్కడే 50 పడకల ఆయుర్వేద ఆసుపత్రి కూడా ఉన్నందున కాలేజీ కేటాయిస్తే బోధనాసుపత్రిగా ఉపయోగపడుతుందని వివరించారు. అటు రాష్ట్ర ప్రభుత్వం తరపున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కూడా కేంద్రంలో పలుదఫాలుగా మాట్లాడారు. ఈనేపథ్యంలో అనేక ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం ఎట్టకేలకు కేంద్రం కాకినాడకు ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆయుష్ విభాగం అధికారులకు తాజాగా సమాచారం అందించింది. ఈ కాలేజీ మంజూరైన నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.16 కోట్ల వరకు నిధులు మంజూరవనున్నాయి. తొలి విడత కింద రూ.7కోట్ల వరకు ఇవ్వనుంది. అయితే ఈ కాలేజీకి నిర్మించాలంటే రెండెకరాల స్థలం అవసరం. అయితే ప్రస్తుతం నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలోనే ఈ భూమి కావాలని కేంద్రం కోరుతోంది. ఈనేపథ్యంలో రెండెకరాల కేటాయింపునకు జిల్లా కలెక్టర్‌ను త్వరలో రాష్ట్ర ఆయుష్ అధికారులు కోరనున్నారు. కాలేజీ, ఆసుపత్రి ఒకే చోట ఉండాల్సిన అవసరాన్ని వివరించనున్నారు.

ఎన్ని ఉపయోగాలో...

ఆయుర్వేద కాలేజీలు రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడలో ఉన్నాయి. ఇప్పుడు మూడో కాలేజీ కాకినాడకు మంజూరు చేశారు. అయితే రాజమహేంద్రవరంలో హోమియో కాలేజీ ఉంది. కాకినాడలో ఆయుర్వేద మెడికల్ కాలేజీని కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఈ కాలేజీకి తొలుత యాభై సీట్ల వరకు కేంద్రం అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆ తర్వాత వంద సీట్లకు అప్‌గ్రేడ్ చేసే అవకాశం ఉంది. అచ్చం ఎంబీబీఎస్ తరహాలోనే ఆయుర్వేద మెడికల్ కాలేజీలో సీటు కోసం నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పాటుకానున్న ఆయుర్వేద కాలేజీలో ఎనిమిది వరకు స్పెషలిస్ట్ విభాగాల్లో ఆయుర్వేద విద్యను బోధించనున్నారు. ప్రధానంగా కాయ, శల్యతంత్రం, ప్రసూతి, బాలరోగి, సంహిత, పంచకర్మ, అనాటమీ, ఫిజియాలజీ విభాగాల్లో నాలుగున్నరేళ్ల ఆయుర్వేద విద్యను బోధిస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే టెండర్లు పిలిచి కాలేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇదిలాఉంటే కాకినాడలో నిర్మాణం కానున్న ఆయుర్వేద కాలేజీ, అనుబంధ ఆసుపత్రి వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో అనేకమంది రోగులకు వైద్య సేవలు అందనున్నాయి. ప్రస్తుతం అనేకమంది మొండి వ్యాధులు, ఇతర అనారోగ్యాలకు ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఖర్చు తక్కువ, మంచి ఫలితాలు ఉండడంతో ఆయుర్వేద చికిత్స అందించే పలు ప్రైవేటు ఆసుపత్రులకు సైతం గిరాకీ అధికంగా ఉంటోంది. ఈనేపథ్యంలో కాలేజీ రాకతో అనేకమందికి అతి తక్కువ ఖర్చుతో అనేక దీర్ఘకాలిక, చిన్న చిన్న అనారోగ్యాలకు సైతం చికిత్స అందనుంది.

కాకినాడలో కొత్తగా నిర్మించిన ఆయుర్వేద ఆసుపత్రి

కొడుకులను కడతేర్చి.. తాను అంతమై.. 9

ఇన్‌చార్జి కమిషనర్లకు పూర్తి బాధ్యతల అప్పగింత

» పిఠాపురానికి డీఈఈ రాజు
» గొల్లప్రోలుకు ఏఈఈ అహ్మద్ అలీషా
» ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఏ
» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు



అహ్మద్ అలీషా

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కమిషనరుగా డీఈఈ పి.రాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం పురపాలక సంఘం రెగ్యులర్, గొల్లప్రోలు నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనరుగా ఉన్న నామ కనకారావు అమెరికా వెళ్లేందుకుగాను ఈనెల 6వతేదీ నుంచి డిసెంబరు 31వతేదీ వరకూ సెలవులో వెళ్లడం, ఎవరికీ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించకపోవడం లేదా రెగ్యులర్ కమిషనర్లను నియమించకపోవడంతో రెండు పట్టణాల్లో పాలన స్తంభించిన విషయమై ఆంధ్రజ్యోతి పత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనితో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి ఈ విషయాన్ని డీఎంఏ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఇప్పటివరకూ డెలిగేట్ కమిషనర్‌గా తాత్కాలిక బాధ్యతలు నిర్వర్తిస్తున్న డీఈఈ రాజుకే పిఠాపురం కమిషనరుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరుగా అక్కడ ఏఈఈగా పనిచేస్తున్న ఎండీ అహ్మద్ అలీషాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి బుధవారం రాత్రి నగర పంచాయతీ కార్యాలయానికి చేరాయి. రెగ్యులర్ కమిషనర్లు విధుల్లో చేరేవరకూ పిఠాపురం, గొల్లప్రోలు కమిషనర్లుగా వీరు వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్‌పై పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం, కేంద్ర పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా నవంబరు 14, 15తేదీల్లో భాగస్వామ్య సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. దీనిలోభాగంగా ఈనెల 15 నుంచి నవంబరు 15 వరకు కాకినాడ జోన్‌లో ఉన్న పారిశ్రామికవాడల్లో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణాల ప్రగతి, జిల్లాలో పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలపై యువపారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఉపాధి అవకాశాలపై వివరిస్తారన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ గణపతి, డీపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం రాజోలు పర్యటన వాయిదా

మలికిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాజోలు ప ర్యటన వాయిదా పడిందని, దీపావళి తర్వాత ఆయన పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే దేవవరప్రసాద్ బుధవారం ఒకప్రకటనలో తెలి పారు. ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన, మరోవైపు వాడపల్లి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్భంగా పోలీసుబలగాలు ఆయా కార్యక్రమాలకు వెళ్లడంతో పవన్ పర్యటన వాయిదా పడినట్టు తెలిసింది. దీపావళి పండుగ తరువాత మలికిపురం మం డలం కేశనపల్లి తీరగ్రామాల్లో తోటల పరిశీలన, అనంతరం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తెలిపారు.

ప్రధాని సభకు 500 మంది పారిశ్రామికవేత్తలు పయనం



కలెక్టరేట్ నుంచి బస్సులో ప్రధానమంత్రి కర్నూలు సభకు బయలుదేరుతున్న పారిశ్రామికవేత్తలు, ట్రేడర్లు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గురువారం జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు కాకినాడ జిల్లా నుంచి 500మంది పయనమై వెళ్లారు. దీనిలో పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ట్రేడర్లు ఉన్నారు. ప్రధానంగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రధానమంత్రి వివరించనున్నారు. చిరువ్యాపారులకు, ఎంఎస్ఎంఈలకు సులభతరమైన జీఎస్టీ స్లాబ్ పద్ధతులను వెల్లడిస్తారు. యువ సాంకేతిక నిపుణులకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, సులభమైన పన్నువిధానం, జీఎస్టీ సంస్కరణలతో నూతన ఒరవడిపై పేర్కొంటారు.జీఎస్టీ తగ్గింపువల్ల వివిధ వర్గాలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తారు. కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వఆదేశాల మేరకు కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు కర్నూలుకు వెళ్లారు. జిల్లాలో రెవెన్యూ, పరిశ్రమలు, జీఎస్టీ శాఖల సమన్వయంతో ప్రతినిధులను ప్రధాన సమావేశానికి పంపారు. కాకినాడ నుంచి ఒక బస్సు బయలుదేరగా మిగిలినవారు సొంత వాహనాలు, రైల్వే ద్వారా పయనమైన కర్నూలు వెళ్లారు. ఈ నేపథ్యంలో అక్కడ వారికి ఏర్పాట్లు చేయడానికి కాకినాడ నుంచి అధికారుల బృందం ఒకటి ప్రత్యేకంగా బయలుదేరి వెళ్లింది. అక్కడ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు పాల్గొన్న తర్వాత తిరిగి కాకినాడకు వారిని క్షేమంగా తీసుకురావడానికి, సభకు హాజరుకావడానికి పాసులు అందివ్వడానికి అధికారుల బృందం పనిచేస్తుంది. కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ తోట లలిత, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ గణపతి, జీఎస్టీ ఆఫీసర్ అనిశెట్టి స్వామి, పరిశ్రమలశాఖ ఏడీఏ విజయ్‌కుమార్, కలెక్టరేట్ అధికారి జగన్నాథం పాల్గొన్నారు.

నేడు జిల్లాకు 1600 మెట్రిక్ టన్నుల యూరియా

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1600 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ యూరియా స్టాక్ గురువారం కోరమండల్ ఫెర్టిలైజర్స్ నుంచి రైల్వే ర్యాక్ ద్వారా ద్వారపూడి, సామర్లకోటలకు చేరుతుంది. దీన్ని జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు, ప్రైవేటు ఎరువుల డీలర్లు, రైతు సేవాకేంద్రాలకు తరలిస్తారు. ఖరీఫ్‌లో యూరియా కొరత ఎదుర్కొన్న నేపథ్యంలో రబీ సీజన్‌లో ఎరువులను పుష్కలంగా నిల్వ చేసుకునే ఉద్దేశంతో యూరియా దిగుమతి చేస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు కావాల్సినంత యూరియా సరఫరా చేశామన్నారు. రబీ సీజన్‌కు కూడా నిల్వ చేసుకుంటున్నామన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక(అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ) బస్సులు సిద్ధం చేశామని జిల్లా ప్రజారవాణా అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో ఏలేశ్వరం, కాకినాడ, తుని డిపోలనుంచి రాత్రి బస్సులు బయలుదేరి సోమవారం రాత్రికి తిరిగి చేరుకుంటాయన్నారు. కార్తీకమాసంలో ప్రతి రోజూ కాకినాడనుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికుల అవసరం మేరకు ఏలేశ్వరం, తుని డిపోల నుంచి కూడా శ్రీశైలానికి బస్సులు నడుపుతామని తెలిపారు. శబరిమలై యాత్రకు కూడా కొత్త సూపర్ లగ్జరీ బస్సులను మూడు డిపోల్లో సిద్ధంగా ఉంచామన్నారు. మరింత సమాచారం కోసం ఏలేశ్వరం డిపో: 9959225532, కాకినాడ డిపో: 9959225534, 9959225539 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చిరు (ప్రా)ధాన్యం





(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కాకినాడ నగరంతో పాటు పలు పట్టణాల్లో చాలా మంది అన్నం, అల్పాహారం, ఇతర చిరుతిళ్లకు బదులుగా చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలు తినేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. దాంతో పట్టణాలు, పల్లెల్లో క్రమంగా భోజన, అల్పాహారశాలల మాదిరిగానే రాగి జావ, మొలకలు, పళ్ల సలాడ్‌లు విక్రయించే దుకాణాలు బాగా విస్తరిస్తున్నాయి.



కాకినాడ నగరంలోని వివేకానంద పార్కు చుట్టుపక్కల, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేఎన్టీయూ, జిల్లా క్రీడా మైదానం సమీపాల్లో ఈ దుకాణాలను ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఓదెలు, అరికెలు, రాగులు వంటి చిరుధాన్యాల వంటకాలు, జావ తీసుకుంటున్నారు. పచ్చి కూరగాయలైన బెండకాయ, బీరకాయ, సొరకాయ, బీట్‌రూట్, కేరెట్, బూడిద గుమ్మడికాయ వంటి జ్యూస్‌లను సైతం సేవిస్తున్నారు. వాకింగ్, వ్యాయామం చేసేందుకు పార్కులు, ఇతర క్రీడా మైదానాలకు వచ్చేవారు ఈ తరహా ఫుడ్ తీసుకుంటున్నారు. కొవ్వు పదార్థాలను పూర్తిగా దూరం పెడుతున్నారు. వీటిని తీసుకునేందుకు యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

మన శరీరానికి ఆరోగ్యకరమైన పోషకాలను అందించే వాటిలో తృణధాన్యాలు కూడా ఒకటి. అందులో ప్రధానమైనవి రాగులు. వీటిని ఏదో ఒక రూపంలో తీసుకుంటే మంచి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. రాగి ముద్ద, రాగి రోటీ, రాగి గంజి, అంబలి... ఇలా పలు రకాలుగా తయారు చేసుకుని తింటారు. మిల్లెట్లో కాల్షియం పుష్కలంగా ఉండడంతో ఎముకలను దృఢంగా చేయడానికి సహాయపడుతుంది. రాగులు పిల్లల శారీరక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. వృద్ధులు, మహిళల ఎముకల బలానికి మంచి మెడిసిన్ అని చెప్పాలి.

రాగి జావను రోజూ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. రాగుల్లోని పోషకాలు...

మంచి ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. కాలానుగుణంగా జీవనశైలిలో వస్తున్న మార్పులతో ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయి. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా వేధిస్తున్న దీర్ఘకాలిక వ్యాధుల నుంచి తప్పించుకునేందుకు ప్రత్యేక ఆహారంపై ఆధారపడుతున్నారు. రెగ్యులర్ రొటీన్ ఫుడ్‌ను పక్కనపెట్టి.. సంప్రదాయ ఆహార అలవాట్ల దిశగా అడుగులు వేస్తున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రత్యేక నియమ, నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యానికి మేలు చేసే పౌష్టికాహారాన్నే తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా యువత ముందు జాగ్రత్తగా... ఎటువంటి రోగాలూ తమ దరిచేరకుండా ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు.

- మారుతున్న ఆహారపు అలవాట్లు
- నగరాలు, పట్టణాల్లో పెరిగిన మిల్లెట్స్ సంస్కృతి
- సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఫుడ్‌పై ఆసక్తి
- ఉదయాన్నే సేవిస్తున్న యువత



ముఖ్యంగా ప్రొటీన్లు, విటమిన్లు, ఏ, బీ, సీ, మినరల్స్ మన శరీరానికి బలాన్ని ఇస్తాయి. దీంతో జీర్ణశక్తి పెరుగుతుంది. రాగుల్లో ఉండే అమైనో ఆమ్లాలు ట్రిప్టోఫాన్ ఆక లిని తగ్గిస్తుంది. బరువును అదుపులో ఉంచుతుంది. మిల్లెట్ పిండితో చేసిన ఆహారాన్ని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అలాగే గుండె జబ్బులు, ఉబ్బసం వంటివి తగ్గుతాయి. రాగులు తీసుకోవడం వల్ల చర్మం, మెరుస్తూ మృదువుగా ఉంటుంది. మధుమేహాన్ని కంట్రోల్ చేస్తుంది. అలాగే రక్త హీనతను దూరం చేస్తుంది.

నగర జీవనం ఒత్తిడితో కూడినది. నిత్యం ఉరుకులు, పరుగుల మధ్య సాగుతుంది. దీనికి తోడు పిజ్జాలు, బర్గర్లు, నూడిల్స్ వంటి ఫాస్ట్ ఫుడ్ వినియోగం అధికం కావడంతో మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక సమస్యలు ప్రస్తుతం అందరిలోనూ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సహజసిద్ధమైన, పోషక విలువలున్న ఆహారం వైపు దృష్టిసారిస్తున్నారు. జంక్ ఫుడ్ తెచ్చిన ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు పాతకాలపు ధాన్యాలవైపు ఆశగా చూస్తున్నారు.

ముఖ్యంగా యువత హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పేరుతో వీటిని స్టాళ్లగా ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీటిని విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రజలు తమ ఆహారపు అలవాట్లుగా మార్చుకున్నారని వారు చెప్తున్నారు. మొదట్లో అంతగా ఆదరించలేదు. గత ఐదేళ్లగా వినియోగదారుల డిమాండ్ పెరిగింది.



మొలకెత్తిన విత్తనాలు, నువ్వుల ఉండలు, వేరుశెనగ ఉండలు, చిక్కీలు, ఉడకబెట్టిన గుడ్లు విక్రయిస్తున్నారు.





పండ్ల రసాలే కాదు... పచ్చి కూరగాయల రసాలు కూడా...

సాధారణంగా పండ్ల రసాలను తీసుకునే వారిని చూస్తుంటాం. యాపిల్, పైనాపిల్, బత్తాయి, బనానా, ద్రాక్ష, సపోటా, బొప్పాయి వంటి జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లకు ప్రాధాన్యమిచ్చే జనం ప్రస్తుతం పచ్చి కూరగాయల రసాలు సేవించేందుకు వెనుకాడడం లేదు. ఉదయాన్నే పరగడుపున బీట్‌రూట్, క్యారెట్, బూడిదగుమ్మడికాయ, కీరదోసకాయ, సొరకాయ, కాకరకాయ, బెండకాయ, బీరకాయ వంటి జ్యూస్‌లను సేవిస్తున్నారు. గ్లాస్ జ్యూస్ రూ.40 నుంచి రూ.60కి ఇక్కడ విక్రయిస్తున్నారు.

నన్నయలో ఘనంగా ఆహార మహోత్సవ్



వంటకాలను రుచి చూస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

- తొలి రోజు 'తూర్పు' ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు
- నేడు 'పశ్చిమ' వంటకాల ప్రదర్శన

దివాన్‌చెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేవిధంగా ఈ ప్రాంత ప్రజల వంటకాల గొప్పతనాన్ని ఇనుమడింపజేయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 'ఆహార మహోత్సవ్' నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి నన్నయ విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మన వారసత్వ సంపదను, సంప్రదాయాలను, వంటకాలను, గోదావరి జిల్లాల వంటకాల గొప్పతనం తెలియజేయడమే ఈ ఆహార మహోత్సవ లక్ష్యమన్నారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా వాసులు ఆహార మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. న్యాయనిర్ణేతలుగా జిల్లా రోగనిరోధక అధికారి డాక్టర్ కోమలి, రసాయనశాస్త్రం అధ్యాపకురాలు బీబీ నళినీ, గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వత వర్ధినీ, సత్యదేవ నర్సరీ యజమాని శ్రీలక్ష్మీసత్యనారాయణ, యూనియన్ బ్యాంక్ నుంచి ఎస్.పుష్పలత, హాజరై ఆహార పదార్థాలను పరిశీలించారు. శాఖాహార వంటల విభాగంలో బి.ప్రశాంతిశ్రీ బృందం ప్రథమ, పి.శిరీష బృందం ద్వితీయ, కె.మమత తృతీయ బహుమతులు సాధించారు. మాంసాహార వంటల విభాగంలో బాలుర వసతిగృహం విద్యార్థులు ప్రథమ, బి.లక్ష్మి ద్వితీయ, వై.బాబి తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డి.కళ్యాణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, హైకోర్టు న్యాయవాది ఎ.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహార మహోత్సవ్‌లో సందడిగా మారిన స్టాల్స్

జాతీయ బాక్సింగ్ పోటీలకు నిహారిక ఎంపిక



ద్రాక్షారామ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు కారుమూరి నిహారిక ఎంపికైంది. రాజమహేంద్రవరం ఎస్కేవీటీ హైస్కూలులో ఈ నెల 11 నుంచి 14 వరకు అండర్-14, 17 విభాగాల్లో 69వ శాప్ స్కూలు గేమ్స్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. సుమారు 2వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో రామచంద్రపురానికి చెందిన రత్నం కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థిని కారుమూరి లేఖనిహారిక ఫైనల్ ఫైట్‌లో విశాఖపట్నంలోని సాయి అకాడమీకి చెందిన అమ్మాయితో తలపడి ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం కైవశం చేసుకుందని, ఈ నెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అడ్మిన్ సెక్రటరీ వి.భువనేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీడీ ప్రసాద్ పేర్కొన్నారు.

వసుధైక కుటుంబంతో ప్రపంచ సమగ్రత

'గెయిల్' చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు.. ఎస్‌కేవీటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్ రావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ తాత్వికతలోని వసుధైక కుటుంబ సూత్రం ప్రపంచ సమగ్రతకు మార్గదర్శి అని గెయిల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ కేవీఎస్‌రావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీఎస్ రావు మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పునరుజ్జీవనమే సమగ్రశాంతికి, సమతుల్యతకు, నిజమైన నిధులు అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గెయిల్ ఇండియా డివిజనల్ మేనేజర్ హెచ్ఆర్ దివి ప్రభాకర్‌తో పాటు ఖగోళశాస్త్రంపై చీమలమర్రి శ్రీనివాసరావు, నాట్యశాస్త్రంపై సప్పా దుర్గాప్రసాద్, ఆయుర్వేదంపై సూర్యరఘురాం, వివిధ అంశాలపై పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశోధకులు, ఆధ్యాత్మికవేత్తలు, తమ అభిప్రాయాలను, 125 గోష్టిపత్రాలను సమర్పించారు. ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, అధ్యాపకులు పసుపులేటి శ్రీరామ్మూర్తి, డీవీ రమణమూర్తి, పీవీబీ సంజీవరావు, మధులత, లలిత రమ్య శిల్ప పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కొవ్వూరులో హాల్ట్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (నెం.17219/17220), విశాఖపట్నం-కడప ఎక్స్‌ప్రెస్ (నెం.18521/18522) రైళ్లకు కొవ్వూరు స్టేషన్‌లో హాల్టు ఇచ్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాసిన లేఖకు రైల్వే అధికారులు స్పందించి సమాచారం అందిస్తూ, త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. కొవ్వూరు, పరిసర ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ రెండు రైళ్లు కొవ్వూరులో ఆపాలని ఎంపీ పురందేశ్వరి చేసిన కృషి ఫలించిందని రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అధ్యక్షతన బుధవారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు,చార్జిషీట్లు ఫైల్ చేసే సమయంలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై సూచనలు చేశారు. బెయిల్/ జామీనుల విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సిఫార్సులు చేశారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యాచరణ, బాధితుల పరిహార కేసులపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.24.72 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ద్రాక్షారామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలోని శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. జూలై 5 నుంచి అక్టోబరు 15 వరకు 102 రోజులకుగాను ఆలయంలోని హుండీల ద్వారా రూ.24,72,056 ఆదాయం లభించింది. బంగారం 2.200మిల్లీగ్రాములు, వెండి 99 గ్రాములు వచ్చింది. అన్నదాన హుండీ ద్వారా రూ.1,64,675 వచ్చినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభానీ విలేఖరులకు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో, రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీరామ్‌ప్రసాద్, గంగవరం టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు ఈవో వైవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ కార్యక్రమంలో పెంకే సాంబశివరావు, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై స్వామివారు



మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు

సమ్మోహినీరూపుడై...

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై తిరు వీధుల్లో విహరించిన శ్రీవారు
- వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందిన అశేష భక్తజనం
- వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన బుధవారం వేకువజామున సుప్రభాత సేవ, నవనీత హారతిలతో స్వామివారిని మేల్కొల్పారు. అనంతరం వసంత మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు ఉత్సవమూర్తులను తోడ్కొనివచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, హోమాలను వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 10.34 గంటలకు శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని తరించారు. కేరళ వాయిద్యాలు, కథాకళి, నాగాలాండ్ కళాకారుల వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీవేంకటేశ్వర మూలమంత్రపూర్వక వేంకటేశ్వరస్వామి హోమాలను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.10 గంటలకు మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై అధిష్ఠించి తిరువీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని కనులారా చూసి తన్మయత్వం పొందారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



సూర్యప్రభ వాహన సేవలో పాల్గొన్న చైర్మన్ వెంకట్రాజు దంపతులు, ఉప కమిషనరు సూర్యచక్రధరరావు దంపతులు



చంద్ర ప్రభ వాహన సేవను తిలకిస్తున్న అశేష భక్తజనం



భక్తులకు వీనులవిందు చేసిన నాగాలాండ్ కళాకారుల వాయిద్య ప్రదర్శన

సురక్షిత తాగునీటితో రోగాలు దూరం

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందిస్తే కొన్ని రోగాలు దరిచేరవని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు అన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు 8వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసాదరావు శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ అబ్దుల్ మదీనా, విశ్రాంత ఎస్‌ఈలు ఉమాశంకర్, శ్రీనివాసు, డీఈఈ స్వామి, డీఎల్పీవో అమ్మామణి, సీనియర్ ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌లో బెరా యూనిట్ ప్రారంభం



జీజీహెచ్‌లో బెరా యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ లావణ్య

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని ఈఎన్‌టీ విభాగంలో బ్రెయిన్‌స్టెమ్ ఇవోక్డ్ రెస్పాన్స్ ఆడియో మెట్రీ యూనిట్(బెరా)తో పాటు నూతనంగా పునరుద్ధరించిన సౌండ్ ప్రూఫ్ ఆడియో మెట్రీ గదిని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెరా పరీక్ష.. విషయపరంగా ఆధారపడని(ఆబ్జెక్టివ్) శ్రవణ పరీక్షా విధానమన్నారు. ఇది చెవిలో నుంచి మెదడు వరకు ఉన్న శ్రవణ మార్గం స్పందనలను నమోదు చేస్తుందన్నారు. ఈ పరీక్ష నవజాత శిశువులు, పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు అలాగే సహకరించలేని రోగుల్లో వినికిడి స్థాయిని అంచనా వేసేందుకు ఉపయోగకరమన్నారు. ఇది మాలింగ రింగ్ (నకిలీ వినికిడి లోపం) గుర్తించడంలో, మెడికో లీగల్ అలాగే దివ్యాంగుల అంచనా సందర్భాల్లో వినికిడి పరిమితులను కచ్చితంగా నిర్ధారించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ పి.విజయదీప్తి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహర్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

కొడుకులను కడతేర్చి.. తాను అంతమై..

● ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
● ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో కలకలం రేపిన సంఘటన
● ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో
● బంధువుల వేధింపులే కారణమని ప్రస్తావన


మరణించిన కామరాజు, కుమారులు అభిరామ్, గౌతమ్ (ఫైల్)

ఆలమూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం తెల్లవారుజామున ఓ తండ్రి తన కుమారులను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.

అసలేం జరిగిందంటే...

చిలకలపాడుకు చెందిన పావులూరి కామరాజు అలియాస్ చంటి (36) సెలూన్ షాపు నిర్వహిస్తూ తన కుమారులు అభిరామ్(11), గౌతమ్ (8)తో కలసి జీవిస్తున్నాడు. అభిరామ్ ఐదో తరగతి, గౌతమ్ ఒకటో తరగతి మడికిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. అయితే నాలుగేళ్ల క్రితం కామరాజు భార్య పావులూరి నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. బుధవారం తెల్లవారుజామున తన కుమారులు ఇద్దరికి కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చిన తదుపరి కామరాజు ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని బంధువులు గుర్తించి ఆలమూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్, సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు. అయితే చిన్నారులు అభిరామ్, గౌతమ్ మృతిచెందిన విధానంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారి నోటి నుంచి ఎటువంటి నురగలు రాకపోవడంతోపాటు ఎక్కడ పడుకున్నవారు అక్కడ ఉన్నారు.. విషం తాగిస్తే అలా పడుకుని ఉండలేరని వాదన ఉండడంతో పూర్తిస్థాయి విచారణ చేయాలని క్లూస్ టీమ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లను రప్పించి వివరాలు సేకరించారు. ఈ మేరకు ఆలమూరు ఎస్ ఐ జినరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ వీడియో...

కామరాజు ఆత్మహత్య చేసుకునే ముందు చేసిన సెల్ఫీ వీడియో కీలకంగా మారనుంది. "నా కుమారులు, నేను ఆత్మహత్య చేసుకుని మృతి చెందుతున్నాం.. దీనికి ప్రధాన కారణం నా భార్య సమీప బంధువులైన ముగ్గురు వ్యక్తులు (పేర్లను ప్రస్తావిస్తూ). వారు తరచూ నన్ను వేధింపులకు గురి చేస్తుండడంతో పాటు నన్ను హతమార్చడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు, బంధు వులను కూడా దూషిస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు" అని కామరాజు ఆ వీడియోలో పేర్కొన్నాడు. కుమారుడు, మనవుల మృతి పట్ల కామరాజు తల్లితో పాటు బంధువులు విలపించారు.


అభిరామ్, గౌతమ్ మృతదేహాలు

నాలుగేళ్ల కిత్రం భార్య కూడా..

కామరాజు భార్య నాగలక్ష్మి నాలుగేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. దీంతో మరణానికి కామరాజే కారణమని నాగలక్ష్మి బంధువులు ఆరోపించడంతో అతడిపై ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ప్రస్తుతం కామరాజు తన కుమారులకు చంపి, తాను ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. కుటుంబంలోని నలుగురు ఒకే రకంగా మృతిచెందడంతో సంచలనం కలిగించింది. నలుగురి మరణాలపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కాకినాడలో రెండు స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని రెండు స్కానింగ్ సెంటర్లపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వాటి పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసినట్టు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జన్మభూమి పార్క్ సమీపంలోని యూఎస్ ఉమెన్ కేర్ ఫెర్టిలిటి క్లినిక్, అలాగే నూకాలమ్మ గుడి సమీపంలోని వెంకటేశ్వర స్కాన్ సెంటర్ పీసీ అండ్ పిఎన్‌డిటి యాక్ట్ రిజిస్ట్రేషన్ల రద్దు ఈ నెల 14వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని డీఎంహెచ్‌వో తెలిపారు. కాకినాడ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసి స్కానింగ్ కేంద్రాల సమాచారం లేదా నమోదు కాని స్కానింగ్ కేంద్రాలు అలాగే అర్హత లేని వైద్యుల వివరాలు టోల్ ఫ్రీ నెంబర్ (1800 4253365) లేదా వాట్సప్ నెంబర్ 9494 113365కు గాని తెలియపర్చినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మహ్మద్ జాఫర్ (ఫైల్)

గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుకనుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం శివారున బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పి.మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిడదవోలు పట్టణానికి చెందిన మహ్మద్ జాఫర్ (41) సమిశ్రగూడెంలో గతంలో వర్క్ షాపులో పనిచేసేవాడు. అయితే 3 నెలల క్రితం కంచర్లగూడెం-జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో ఫిట్టరుగా చేరాడు. బుధవారం సాయంత్రం గోపాలపురం నుంచి ఫ్యాక్టరీ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న గూడ్స్ లారీ ఢీకొనడంతో జాఫర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన గూడ్స్ లారీ ఆగకుండా వెళ్లిపోగా వెంబడించి మెట్ట వద్ద డ్రైవర్‌తో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మనోహర్ తెలియజేశారు.

ఏపీ ఉమ్మడిగా ఉంటేనే బాగుండేది..


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

● కలిసున్నప్పుడు దేశంలోనే రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్
● విభజన తర్వాత తెలుగు రాష్ట్రాల స్థానమేంటో చూడండి
● పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి : ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉంటేనే బాగుండేదని.. తాను ఇప్పటికీ అదే కోరుకుంటున్నానని ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ నేత ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉండేదని, కానీ.. విభజన తర్వాత ఈ రెండు రాష్ట్రాలు ఏ స్థానాల్లో ఉన్నాయో చూడాలని వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కలసి ఉంటే కలదు సుఖం. అందుకే తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగానే ఉండాలని కోరుకున్నాను. అలా ఉంటేనే బాగుండేది. ఇప్పటికీ నేను అదే మాటపై ఉన్నాను' అని అన్నారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దాని వల్ల 7.2 లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని, 23 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం తన హయాంలోనే టెండర్లు పిలిచానని గుర్తుచేశారు. కృష్ణా జలాలపై 1976 బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఏపీ వాడుకోవచ్చని చెప్పారు. కానీ, ట్రిబ్యునల్ ఆర్డర్‌ను పునఃపరిశీలన చేయాలని తెలంగాణ అడుగుతోందని, దీనిపై మన ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. తాను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడానని.. నీరు ఉన్నప్పుడు ఫర్వాలేదు కానీ నీరు లేనప్పుడు సమస్య ఉత్పన్నమవుతుందని చెప్పానని అన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇద్దరూ కలసికట్టుగా ఆలోచన చేసి ఈ విషయంలో కోర్టులో గెలవడం ముఖ్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, అయితే మరింత వేగం అవసరమని అన్నారు. ప్రధాని మోదీ కూడా రాష్ట్రానికి సహకారం అందిస్తున్నారని, ఇది మరింత పెరగాలని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో నిందితుడుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని ఐక్యరాజసమితి సమావేశాలకు పంపడంపై కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ... పార్లమెంట్ వేరు, కేంద్రం వేరని.. న్యాయశాస్త్రం ప్రకారం శిక్ష పడేవరకూ ఎవరినీ దోషి అనలేమని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లంచాల 'రెవెన్యూ'.. అదే మహా'ప్రసాదం'!

» సర్టిఫికెట్ కావాలంటే సొమ్ములు చెల్లించాల్సిందే
» ఎఫ్‌లైన్ సర్వేకు రూ.లక్ష డిమాండ్
» అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న లంచాల బాగోతం
» పట్టించుకోని ఉన్నతాధికారులు
» తాజాగా అమలాపురంలో రూ.50వేలు లంచంతో పట్టుబడ్డ తహశీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్


లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము

అమలాపురం/అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పారదర్శకంగా పౌర సేవలు అందిస్తున్నట్టు ప్రకటిస్తున్నప్పటికీ ఆ సేవలను పొందాలనుకునే ప్రజలు మాత్రం రెవెన్యూ అధికారులకు భారీగా లంచాలు సమర్పించుకుంటే గానీ పని ముందుకు వెళ్లడం లేదు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా దానికో రేటు నిర్ణయిస్తున్నారు. ఆ రేటుతో ఏ రూటులో వెళ్లాలో కూడా కిందిస్థాయి రెవెన్యూ యంత్రాంగమే సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిరుద్యోగుల నుంచి తహశీల్దార్ల వరకు భారీగా అవినీతికి పాల్పడుతున్నారు. ఇటీవల విద్యా సంవత్సరం ప్రారంభసమయంలో ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నవారి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారు. ఇది ఒక కోనసీమ జిల్లా అమలాపురంలోనే కాదు అన్ని కేంద్రాల్లోను ఈ తరహా దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలు శూన్యం. కాగా అమలాపురం తహశీల్దార్ కార్యాలయం కేంద్రంగా సర్టిఫికెట్‌కు రూ.2వేలు లంచం ఇస్తే తప్ప డిజిటల్ సైన్ పడేది కాదు. కార్యాలయాల్లో పని చేసే చిరుద్యోగులనే కలెక్షన్ ఏజెంట్లుగా పెట్టుకుని వసూళ్ల దందా కొనసాగించారనడానికి బుధవారం కోనసీమ జిల్లా అమలాపురం తహశీల్దార్ కేంద్రంలో జరిగిన ఏసీబీ రైడే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, కలెక్షన్ ఏజెంట్‌గా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్ రాములు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని రాజోలు ప్రాంతానికి చెందిన గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమితం రూ.50వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. లంచం సొమ్ముతో పాటు అదనంగా కార్యాలయంలో రూ.5.85 లక్షల సొమ్మును కూడా ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ సొమ్ము కూడా భూముల సర్వే నిమిత్తం బుధవారం వచ్చిన కలెక్షనే అంటూ ప్రచారం జరుగుతుంది. రెవెన్యూశాఖలో డెత్ సర్టిఫికెట్లు, భూముల మ్యూటేషన్, భూముల సర్వే రీసర్వేలు, వీటితో పాటు ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాల సర్టిఫికెట్లు, ఇలా ప్రతీ పనికి ఒక రేటు పెట్టుకుని సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. పైగా ఇటీవలే తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమలాపురం డివిజన్ అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. అంతటి హోదాలో ఉండి అడ్డూ అదుపు లేకుండా లంచాల దందాలను కొనసాగిస్తున్నారనే విమర్శలు తహశీల్దార్ కార్యాలయం కేంద్రం గత కొన్ని నెలల నుంచి వెల్లువెత్తుతున్నప్పటికీ ఏ ఒక్క ఉన్నతాధికారి స్పందిండం లేదనే విమర్శలు ప్రజల నుంచి బాహాటంగా వ్యక్తమవుతున్నాయి.


కనీస స్పందన ఏది..?

జిల్లా కేంద్రంగా ఉన్న అమలాపురంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోతో సహా ఎంతో మంది ఉన్నతాధికారులు ఉన్నా ఏనాడు తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేసి అక్కడే వేచి ఉండే ప్రజల్ని అడిగితే లంచాల మాటున సాగే ఎన్నో యథార్థాలు సాక్షాత్కరించేవని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. ఇటీవల ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి సచివాలయం-3లో కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీమన్నారాయణ అనే వీఆర్వో మ్యూటేషన్ నిమిత్తం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అయితే ఆ సమయంలో అసలు సూత్రధారులను పక్కకు తప్పించడంలో కొందరు ఉద్యోగులు సహకరించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా కోనసీమ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో మామూళ్ల దందాలు పేట్రేగిపోతున్నప్పటికీ ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కనీసం స్పందించకపోవడంతో మరింత రెచ్చిపోయి దందాలను యథేచ్ఛగానే కొనసాగిస్తున్నారనడానికి అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన భారీ అవినీతే అద్దం పడుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా కార్యాలయంలో అదనంగా దొరికిన రూ.5.88లక్షలు నగదు ఎక్కడదనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీసే క్రమంలో కామనగరువు లేఅవుట్‌లో ఉంటున్న తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో ఏసీబీ అధికారులు బుధవారం రాత్రి సోదాలు కొనసాగిస్తున్నారు. కాగా రెవెన్యూ అధికారుల అవినీతి అమలాపురం కేంద్రంగా బట్టబయలు కావడంతో మిగిలిన ప్రాంతాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సమాచారం.

ఇదీ తహశీల్దార్ అవినీతి బాగోతం...

15 సెంట్ల భూమి ఎఫ్‌లైన్ సర్వేకు అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ రూ.లక్ష డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో రూ.50వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు నేరుగా దాడి చేసి పట్టుకున్నారు. దాడి సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో అదనంగా లెక్కలు చూపని రూ.5,88,500 నగదు ఉండడాన్ని గుర్తించారు. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం సమీపంలోని రాజవోలు గ్రామానికి చెందిన గంధం దుర్గా కొండలరావుకు అమలాపురంలో 15 సెంట్ల స్థలం ఉంది. కొండలరావు తండ్రి వెంకటసత్యనారాయణ 1995లో 15 సెంట్ల స్థలాన్ని కొనుగోలుచేసి ఉంచారు. ప్రస్తుతం తండ్రి సత్యనారాయణ ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉండడంతో ఆ స్థలాన్ని విక్రయించి వైద్యం చేయించుకోవాలని కొండలరావు కుటుంబం భావించింది. అయితే ఆ భూమిని విక్రయించేందుకు ఎఫ్‌లైన్ సర్వే తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంది. దాంతో కొండలరావు అమలాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించారు. ఎఫ్‌లైన్ సర్వే చేయాలంటే రూ. లక్ష చెల్లించాలని తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ డిమాండ్ చేసినట్టు తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని అదే కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాము రూ.50వేలుకు సెటిల్ చేశారు. అయితే అంత మొత్తాన్ని ఇచ్చేందుకు మనస్కరించని కొండలరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో బుధవారం సాయంత్రం అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో కొండలరావు రూ.50వేలు నగదు అందజేస్తుండగా ముందస్తు వ్యూహంతో ఉన్న ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే తహశీల్దార్ కార్యాలయంలో అక్కౌంటెంట్ క్యాష్ రూ.5,88,500 ఉండడాన్ని ఏసీబీ అధికారులు గుర్తించారు. లంచంగా ఇచ్చిన రూ.50వేలు నగదుతో పాటు మొత్తం రూ.6,38,500 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లెక్క చూపకుండా ఉన్న నగదు ఎలా వచ్చిందో విచారణలో తేలుస్తామన్నారు. రామును తహశీల్దార్ కార్యాలయంలో కస్టడీలో ఉంచి తహశీల్దార్ అశోక్‌ప్రసాద్‌ను సమీపంలోనే ఉన్న ఆయన ఇంటి వద్దకు ఏసీబీ అధికారులు తీసుకువెళ్లారు. అశోక్‌ప్రసాద్, రాములను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తున్నట్టు డీఎస్పీ కిశోర్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం అమలాపురం ఆర్డీవో కార్యాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్‌శాఖ అధ్యక్షుడిగా తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'అడపా అప్పారావు మరణం తీరని లోటు'


అడపా అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

అమలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు పత్రికా రంగంలో జర్నలిస్టుగా విశిష్ట సేవలందించిన అడపా అప్పారావు మరణం పాత్రికేయులు, ప్రజలకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెం గ్రామంలోని అప్పారావు స్వగృహం వద్ద బుధవారం మధ్యాహ్నం సీనియర్ జర్నలిస్టు కాట్నం వెంకటరత్నం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. అప్పారావు పాత్రికేయుడిగా పనిచేసిన కాలంలో ఎందరో జర్నలిస్టులను ఫీల్డులోకి తీసుకువచ్చిన వ్యక్తి అని కొనియాడారు. అప్పారావు పేరిట స్మారకార్థం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడంతో పాటు ఆయన విగ్రహాన్ని రూపొందింపచేసి ప్రతిష్ఠింపచేయాలని వక్తలు సూచించారు. జర్నలిస్టుగా ఐదు దశాబ్దాల పాటు పని చేసిన అప్పారావు లేనిలోటు జర్నలిస్టులకు తీరనిదని పలువురు పేర్కొన్నారు. తొలుత అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రజ్యోతి సంస్థ రాజమహేంద్రవరం బ్రాంచి మేనేజర్ సిద్ధిరెడ్డి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్‌కు చెందిన పారుపల్లి శ్రీధర్, జర్నలిస్టు నేతలు మండేల శ్రీరామమూర్తి, కటికిరెడ్డి శ్రీరామారావు (బాబాయ్), నిమ్మకాయల సతీష్, ఆచంట వెంకట్, నాయకులు రంకిరెడ్డి సూర్యనారాయణ, ఉంగరాల బూరిబాబు, తాడి నరసింహారావు, కాకినాడకు చెందిన ఏలియా, ఢిల్లీకి చెందిన శర్మ, ప్రవీణ్, అనేకమంది ప్రముఖులు, మేధావులు అప్పారావు సేవల్ని కొనియాడారు.

ప్రతి ఒక్కరికీ పరిహారమివ్వాలి

● కదం తొక్కిన పోలవరం నిర్వాసితులు
● ర్యాలీగా తరలివచ్చి ఐటీడీఏ ముట్టడి
● సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అల్లూరి జిల్లా కలెక్టర్ హామీ


చింతూరు ఐటీడీఏ ముందు నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

చింతూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఒక్కటయ్యారు. ముంపు గ్రామాలన్నింటికీ 2013 భూసేకరణ ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిహారంతోపాటు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని లోతట్టువాసులు బుధవారం ర్యాలీగా తరలివచ్చి చింతూరు ఐటీడీఏని ముట్టడించారు. విలీన మండలాలైన మల్లెతోట, గుర్రంపేట, రామవరం తదితర గ్రామాల నిర్వాసితులు పెద్దసంఖ్యలో వచ్చారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తాము ఏటా పడుతున్న వెతలు ఏకరవు పెట్టారు. ఈ కష్టాలు భరించలేకపోతున్నామని, తమను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని నిరసన తెలిపారు. వరదల సమయంలో రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకుని తిండికి నోచుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్ల చుట్టూ వరద నీరు ఉండడంతో రోగమొచ్చినా ఆసుపత్రికి వెళ్లే దిక్కు లేకుండాపోతుందన్నారు. ముంపు గ్రామాలన్నింటినీ గుర్తించి 2013 భూసేకరణ మేరకు నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ పరిహారం, 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం, పునరావాసంతోపాటు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో రూ.1.15 లక్షల పరిహారం తీసుకున్న భూములకు కూడా 2013 భూసేకరణ వర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కలెక్టర్ తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని నిర్వాసితులు పట్టుబట్టారు. ఈక్రమంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉన్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వాసితుల దగ్గరకు వచ్చి మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూస్తున్నామని, ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇప్పటి వరకు ప్రకటించిన ముంపు గ్రామాల కంటే అదనంగా మరికొన్ని గ్రామాలు కూడా ముంపుకు గురవుతున్న విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అందరికీ న్యాయం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

26న యానాంలో సాహితీ పురస్కారాల ప్రదాన సభ

యానాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాం ప్రతీఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభ, కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఈనెల 26న యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో జరగనుంది. శిఖామణి జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కారాల గ్రహీత పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్.. యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు అందుకోనున్నారు. కవిసంధ్య అధ్యక్షుడు కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానం రాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్ళకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్‌రాం, డాక్టర్ గూటం స్వామి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కవిసంధ్య ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే..

సుమారు 10మందికి (వచన, అభ్యుదయ, పత్రికా, లఘుకవిత, దళిత సాహిత్యం) ముఖ్య అతిథుల చేతులమీదుగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వారిలో డాక్టర్ కోటేశ్వరారావు, ఎస్.ఆర్.పృథ్వీ, పీఆర్ఎల్.స్వామి, బీహెచ్‌వి.మంగేష్, డాక్టర్ వరుగు భాస్కరెడ్డి, పచ్చిమాల శివ నాగరాజు, పుప్పాల సూర్యకుమారి, పోనుగుమట్ల అశోక్‌కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌లు ఉన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ముగిసిన శాంతిహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

మంత్రజలాలతో సంప్రోక్షణ

అన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో లోకకల్యాణార్థం చేపట్టిన శాంతిహోమం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. ఉదయం నుంచి పండితులు పంచగవ్య ప్రాశన, మూన్యుసూక్తపారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 11గంటలకు ప్రధానార్చకులు కొట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితులు మహదాశీర్వచనం గావించారు. హోమ పూర్ణాహుతి అనంతరం 3రోజులుగా చేపట్టిన పూజాదికాలు, మంత్రాలతో పవిత్రత పొందిన జలాలతో స్వామి ప్రధానాలయం, యంత్రాలయంతో పాటుగా ఆలయ ప్రాంగణమంతా సంప్రోక్షణ గావించారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మంత్రజలాలతో ఆలయమంతా సంప్రోక్షణ చేస్తున్న పండితులు

అక్రమంగా రవాణా చేస్తున్న కలప పట్టివేత

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం డి.రామవరం జంక్షన్‌లో మంగళవారం రాత్రి అడ్డతీగల రేంజ్ ఆఫీసర్ షహేన్షాకు బొలేరో వాహనంపై అక్రమంగా కలప రవాణా జరుగుతుందని సమాచారం వచ్చింది. ఆయన సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. వాహనంలో రాజవొమ్మంగి మండలం సంజీవనగర్‌కు చెందిన బర్లికల రమణబాబు 18 టేకు కర్ర దుక్కలను రవాణా చేస్తుండగా పట్టుకున్నామని రేంజ్ ఆఫీసర్ తెలిపారు. వీటి విలువ రూ.26,355 ఉంటుందని, కేసు నమోదు చేశామన్నారు.


అధికారులు పట్టుకున్న కలప

చాకిరేవులలో 'పల్లెనిద్ర' పాల్గొన్న అల్లూరి కలెక్టర్, రంప ఐటీడీఏ పీవో


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అడ్డతీగల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం చాకిరేవుల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని, వీరవరం గ్రామం నుంచి వెదురునగరం వరకు వెళ్లే రహదారి ఏర్పాటు చేయాలని, గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల ని, వీరవరం నుంచి కొయ్యూరు మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, కన్నేరువాగుపై రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలక సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రజలకు తెలిపారు. పల్లె నిద్ర కార్యక్రమం ఎంతో సంతృప్తినిచ్చిందని, జిల్లాలోని గిరిజన ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దొరకయ్య, ఎంపీడీవో ఏవివి కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డి.నాగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'కౌడా' వైస్ చైర్మన్‌గా కలెక్టర్ షాన్‌మోహన్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) వైస్ చైర్మన్‌గా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ పదవిలో వున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనరుగా బదిలీ అయ్యారు.



విద్యార్థులతో కలిసి ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు

'యువతకు ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కాకినాడ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఐడియల్ కళాశాల విద్యార్థులు 'థాంక్యూ సీఎం సార్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వద్ద నుంచి ఇంద్రపాలెం వంతెన సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులు ప్రదర్శన జరిపారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో ఆంధ్ర రాష్ట్రం డిజిటల్ హబ్‌గా మారుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ జిల్లా చైర్మన్ వనమాడి మోహనవర్మ, ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ పీఎస్ఎస్ కిరణ్, ప్రిన్సిపాల్ వి.సత్యనారాయణ, టీడీపీ నాయకులు గెద్దం పూర్ణచంద్రశేఖర్, దంగేటి సతీష్, సోమిశెట్టి కుమార్, పాలిక సూర్య తదితరులు పాల్గొన్నారు.

గూగుల్‌తో ఒప్పందంతో ఏపీ సర్వతోముఖాభివృద్ధి: ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్‌తో కుదుర్చుకున్న కీలక ఒప్పందంతో ఏపీ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా సరికొత్త అధ్యాయాన్ని చేరుకుంటుందన్నారు. అమెరికా తర్వాత అతిపెద్ద డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు కానుండడంతో సుమారు 2.50 లక్షల మంది ఐటీ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్‌మోహన్, చీమలకొండ వీరభద్రప్రసాద్, బలుసు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


భీమేశ్వరాలయం ఎదుట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కూటమి నాయకులు

'జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత ప్రయోజనం'

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0తో ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. బుధవారం సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయ ఆవరణలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో ఆయనతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. జీఎస్టీపై వాణిజ్య పన్నుల శాఖ ముద్రించిన కరపత్రాలను భక్తులకు, మహిళలకు అందజేశారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్ (బాబు), బలుసు శ్రీనివాసు, వెంకటరమణ, బాపిరాజు, సరోజా వాసు, వల్లూరి బుల్లియ్య, గూనపాటి బుల్లెమ్మ, కొండపల్లి సత్యవాణి, కంచర్ల సుష్మామోహిని, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జీ చక్రవర్తి, కోటిపల్లి శ్రీనివాసరావు, బిక్కిన సాయి, చుండ్రు గోపాలకృష్ణ, నక్కా జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

'పట్టు, పత్తి రైతులు సమన్వయంతో ఉండాలి'

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టు పురుగుల పెంపకందారులు, పత్తి రైతులు పరస్పరం సమన్వయంతో ముందుకెళ్లాలని సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ భువనేశ్వరి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ సూచించారు. చేబ్రోలులో పట్టుపురుగులు గూడుకట్టక నష్టపోతున్నామని పట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో గ్రామంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం రైతు సదస్సు నిర్వహించారు. పత్తి పంట సాగు చేసేవారు చివరి వరసల్లో మందుల పిచికారీలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పట్టు పురుగుల పెంపకందారులు రక్షక పంటలుగా మొక్కజొన్న/సజ్జ/జొన్న పంటలు వేయాలని వివరించారు. ప్రభుత్వ గుర్తింపు లేని మందులు వాడరాదని చెప్పారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి రాజేంద్రప్రసాద్‌బాబు రైతులు 33వేల గుడ్లు పంట పండించారని, ఇవన్నీ గూడుకట్టకపోవడం వల్ల రూ.1.20 కోట్లు నష్టపోయారని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, ఏఎస్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్వదేశీ వస్తువులనే వినియోగించాలి'

పిఠాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు వినియోగించడం వలన దేశ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని బీజేపీ నాయకులు అన్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్వదేశీ వస్తువుల వినియోగంపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. బీజేపీ నాయకులు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, బుర్రి మురళీధరరావు, గండి కొండలరావు, సైతన సత్యకుమారి, అడబాల వీరమోహనరావు, పసుపులేటి సత్యనారాయణ, ఆత్మనిర్భర్ భారత్ ఇన్‌చార్జి అద్దంకి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

పిఠాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు సూచించారు. కలాం జయంతి సందర్భంగా కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కలాం చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల కలాం విగ్రహానికి పలువురు ప్రముఖులు, విద్యార్థులు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఏ టు జెడ్ వలంటీరు సారా శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారత్ పబ్లిక్ స్కూల్ అధినేత గట్టి శ్రీకృష్ణదేవరాయ, దంగేటి శ్రీరామ్, కర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి) శ్రీప్రకాష్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని కలాం విగ్రహానికి ప్రొఫెసర్ ఆర్ఎస్ సంతానం పుష్పమాల వేసి నివాళులర్పించారు. అకడమిక్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బాలికల హక్కులను హరిస్తే చర్యలు'

గొల్లప్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికల హక్కులను హరించినా, భంగం వాటిల్లేలా వ్యవహరించినా చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ అసమానతలు, విద్య, వైద్య సంరక్షణ, పోషణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, చట్టాల గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు మానసాదేవి, హెచ్ఎం సీహెచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ రాకతో రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో ప్రతిష్టాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటుచేయనున్న భారీ డేటా సెంటర్‌తో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కలిపి రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని టీడీపీ నేతలు వెల్లడించారు. కాకినాడలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, ఇతర నేతలతో కలిసి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. సమావేశంలో కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, టీడీపీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మేకా లక్ష్మణమూర్తి, బోళ్ల కృష్ణమోహన్, సుంకర తిరుమలకుమార్, కర్రి నారాయణ, వుండవల్లి వీర్రాజుచౌదరి, జహీరుద్దీన్ జిలాని, కాకరపల్లి చలపతి, ఆళ్ల బాలకృష్ణ, తలాటం హరీష్, దేవు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్ ఏఐ హబ్ రానుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పిఠాపురంలో సంబరాలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా వర్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి సెంటర్లో కేక్ కట్ చేశారు. ఈ ఒప్పందంతో ప్రపంచమంతా నేడు ఏపీ వైపు చూస్తోందన్నారు. దేశం మొత్తం గర్వించే విధంగా గూగుల్ సంస్థ ఏపీకి రావడాన్ని అందరూ స్వాగతిస్తుంటే వైసీపీ నేతలు మాత్రం గూగుల్ క్లౌడ్ సంస్థలకు భూములు ఇవ్వకుండా అడ్డుపడటమే గాక ఆ సంస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ చరిత్రను ఈ పెట్టుబడి మార్చివేస్తుందని చెప్పారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కాకినాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


పిఠాపురంలో సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

అదనపు కమిషనరు సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పారిశుధ్య పరిస్థితిని పరిశీలించేందుకు నగరపాలక సంస్థ అదనపు కమిషనరు కేటీ సుధాకర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 11వ సర్కిల్ పరిధిలోని వార్ఫ్ రోడ్డు, జిల్లా పరిషత్, 14వ సర్కిల్‌లోని గైగోలుపాడు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చూసి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో అలసత్వం వద్దని, ప్రమాణాలు మెరుగుపరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్తరు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పారిశుధ్య కార్మికుల హాజరుపత్రాలను పరిశీలించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సత్తిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

ఓట్ల చోరీపై ప్రజా ఉద్యమంలా సంతకాల సేకరణ

కాకినాడ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ పిలుపుమేరకు ఓట్ల చోరీపై సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలా జరుగుతోందని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు పేర్కొన్నారు. ఓట్ల చోరీపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం బాలాజీచెరువు సెంటర్ వద్ద సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా డీసీసీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. బాలాజీచెరువు సెంటర్ వద్ద సంతకాల సేకరణను పళ్లంరాజు ప్రారంభించగా... అక్కడి నుంచి జగన్నాథపురం వంతెన వరకు కొనసాగింది. పీసీసీ సభ్యులు కుక్కల పోతురాజు, పోలిశెట్టి శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, కాంగ్రెస్ నాయకులు యాళ్ల రామకృష్ణ, అప్పారెడ్డి, పిట్టా అర్జున్, పిల్లి చిన్న, బండారు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పళ్లంరాజుకు సత్కారం


కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గోల్డ్ మార్కెట్‌లో బుధవారం కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజును నగర బంగారం, వెండి వర్తక సంఘం అధ్యక్షుడు అనిసెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా పళ్లంరాజు మాట్లాడుతూ ఈ సంఘం సామాజికంగా చేస్తున్న సేవలను అభినందించారు.



సందీప్ దంపతులకు మాజీ సీఎం ఆశీర్వాదం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గొడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ స్వగృహానికి బుధవారం కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణతో కలిసి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి విచ్చేశారు. వారికి ఎమ్మెల్యే నానాజీ-అరుణ దంపతులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తనయుడు సందీప్-శ్రీలేఖ దంపతులకు కిరణ్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీర్వదించారు.

గొల్లప్రోలు తహసీల్దారుగా రామ్‌కుమార్



గొల్లప్రోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు తహసీల్దారుగా జి.రామ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిఠాపురం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న ఈయన ప్రస్తుతం పాడా కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ ఉద్యోగ విరమణ తర్వాత పిఠాపురం తహసీల్దారు పీవీ గోపాలకృష్ణను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఒక్కరే రెండు మండలాల బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో ఉన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గొల్లప్రోలు తహసీల్దారుగా రామ్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూపరంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామ్‌కుమార్ చెప్పారు.

'అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం'

పెద్దాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత మహారాణి కళాశాల ఎదురుగా ఉన్న వాణిజ్య సముదాయాల వెనుక వైపు బీసీ హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ సెంటరు వద్ద గల అంబేడ్కర్ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో పాల్గొన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆర్డీవో కె.శ్రీరమణి, ఎంపీడీవో కేవీ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసిమంగతాయారు, సీడీపీవో ఉష, ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, కూటమి నేతలు పాల్గొన్నారు.


గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

'బాణసంచా దుకాణాలకు రేకుల షెడ్లు తప్పనిసరి'

కొత్తపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయ షాపుల వ్యాపారస్తులు తప్పనిసరిగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని కొత్తపల్లి ఇన్చార్జి తహసీల్దారు డీవీ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. వాకతిప్పలో 2, ఉప్పాడ-అమీనబాద్‌లో 2, మూలపేటలో 3, కొమరగిరి లే ఔట్‌లో ఒకటి దుకాణానికి పలువురు దరఖాస్తు చేశారు. ఆయా ప్రాంతాలను బుధవారం ఆయన పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో పరిశీలించారు. ఇన్చార్జి తహసీల్దారు మురళీకృష్ణ మాట్లాడుతూ నిర్వాహకులు టెంట్ ఏర్పాటు చేసినట్టయితే అనుమతులు ఇచ్చిన తక్షణం రద్దు చేస్తామన్నారు. షాపునకు, షాపునకు మధ్య కనీసం 50 మీటర్ల దూరం ఉండాలన్నారు. అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని, షాపులకు ఎదురుగా వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్, పిఠాపురం అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ, ఏఎస్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.


ఉప్పాడలో బాణసంచా దుకాణాల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భక్తుల సేవలో భీమేశ్వర అన్నదాన ట్రస్టు

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట భీమేశ్వరాలయం సమీపాన భీమేశ్వర అన్నదాన ట్రస్టు ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయిసత్యనారాయణ కుటుంబ సభ్యుల సౌజన్యంతో సుమారు రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన అధునాతన పుల్కా, పూరీ, చపాతీ తయారీ యూనిట్‌ను బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప లాంఛనంగా ప్రారంభించారు. గంటకు సుమారు 200 పుల్కాలు తయారు చేయవచ్చని ఎమ్మెల్యేకు పరమేశ్వరసాయి వివరించడమే గాక అప్పటికప్పుడు తయారుచేసి సుమారు 50 మందికి అల్పాహారాన్ని అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు చుండ్రు గోపాలకృష్ణ, ఆర్వీ. సుబ్బరాజు, గంజి బూరిబాబు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బలుసు శ్రీనివాసు, పైణ్ణి శ్రీనివాసు, జనసేన నాయకులు సరోజా వాసు, బీజేపీ నాయకులు వెంకటరమణ, ఎస్.బాపిరాజు, గూనపాటి బుల్లెమ్మ, కొండపల్లి సత్యవాణి, కంచర్ల సుష్మామోహిని, నక్కా శ్రీనివాసు, నక్కా జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఈజెడ్‌లో ఉన్న మా భూములను కూడా తిరిగి ఇప్పించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజెడ్‌లో ఉన్న తమ భూములను కూడా తిరిగి ఇప్పించి తమ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని దళిత రైతులు బుధవారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ది ల్యాండ్ అండ్ లైవ్లీహుడ్ లూజర్స్ ఫెడరేషన్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కో-ఆర్డినేటర్ చెంగల్‌రావు మాట్లాడుతూ సెజ్‌లో 205 మంది దళిత రైతుల భూములను కూడా రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా రైతుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘ

జిల్లా అధ్యక్షుడిగా రమణ

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘ అధ్యక్షుడిగా సామర్లకోట మండలం గొంచాలకు చెందిన ఎంవీవీ రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల వీఏఏల సమావేశాన్ని సామర్లకోట వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఆవరణలో బుధవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా జి.బ్రహ్మానాయుడు, కోశాధికారిగా టి.సోమరాజు, ఉపాధ్యక్షులుగా కేవీ శివప్రసాద్, కె.గౌతమ్, సంయుక్త కార్యదర్శులుగా హసీనాసుల్తానాషేక్, కె.ఉదయ్‌కుమార్, బి.ప్రసన్నకుమార్, 20మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్త కార్యవర్గం జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయకుమార్, కాకినాడ ఏవోల అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.రత్నప్రశాంతి, ఏఈవోల అసోసియేషన్ అధ్యక్షుడు డి.వేణుమాధవ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

ఉపాధి హామీ పనుల్లో రూ.6.52 లక్షలు రికవరీ

సామర్లకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో క్షేత్ర స్థాయిలో పలు అవకతవకలకు పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.6,52,371 రికవరీ చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కరక హిమమహేశ్వరి అధ్యక్షతన బుధవారం సాయంత్రం వరకు సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మొత్తం పనుల్లో 944 పనులకు రూ.10,71,42,448కు గాను రూ.6,52,371 రికవరీ చేయాలన్నారు. గ్రామాల నివేదికలపై అధికారులు అధ్యయనం చేశారు. ఏపీడీ పల్లాబత్తుల వసంతమాధవి, డీవీవో విజయభాస్కర్, డిప్యూటీ డైరెక్టర్ ఏపీసాట్, బి.రామారావు, ఎస్ఆర్‌పీ సీహెచ్ సత్యనారాయణ, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీపీ బి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

తాళ్లరేవు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీ సీపీఆర్ శిక్షకుడు గోపాలకృష్ణ బుధవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ, అధ్యాపకులు సౌశీల్య, సత్యకిరణ్, దుర్గామల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

తాళ్లరేవు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరంగ పంచాయతీ పరిధి సీతారామపురం గుడ్డువానితూము సెంటర్లో శ్రీయువశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆటో యూనియన్ సభ్యులు, దాతల సహకారంతో 5వేల మందికి అన్నసమారాధన చేశారు. ఆటో యూనియన్ సభ్యులు కామాడి గంగరాజు, సంగాని సతీష్, పంతాడి కాసుబాబు, దండుప్రోలు సత్తిబాబు, శీలం లక్ష్మణరావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.


యూసీఈకే ప్రిన్సిపాల్ మోహన్‌రావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ దొరస్వామినాయక్

ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా

దొరస్వామినాయక్

జేఎన్టీయూకే, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ లైబ్రేరియన్‌షిప్, అడ్మినిస్ట్రేషన్ పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఢిల్లీలోని ఇంటర్నేషనల్ పబ్లికేషన్ హౌస్ నుంచి ఇది ప్రచురితమవుతుంది. సంబంధిత నియామకపత్రాన్ని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు నుంచి దొరస్వామినాయక్ బుధవారం అందుకున్నారు. ఆయన్ను పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.



బాలికల పరిరక్షణపై అవగాహన సదస్సు

కొత్తపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బాలికతోనే మార్పు, రండి ముందుకు' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, వివక్షతపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ

రౌతులపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 24వేల మంది ఉపాధిహామీ శ్రామికులకుగాను 14వేల మందికి ఈకేవైసీ పూర్తి చేసినట్టు ఏపీడీ జగదాంబ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో శివరామకృష్ణయ్య అధ్యక్షతన ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగిలిన శ్రామికులు ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. 2026-27 ప్లానింగ్ పనులపై సమీక్షించారు. పనులపై గ్రామసభలు పెట్టి పంచాయతీ తీర్మానాలు తీసుకోవాలని సూచించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అబ్దుల్ కలాం చిరస్మరణీయుడు

● ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తోట శ్రీనివాస్



కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కళాశాల సిబ్బంది

వై.రామవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తోట శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం కలాం జయంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అధ్యాపకుడు వేమాల శ్రీనివాసరావు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పల్లేటి చంద్రశేఖర్, గొర్ల పాపారావు, కంటు శివయ్య, ఈశ్వరకృప, త్రినేత్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఆర్ స్వామి ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ బృందం నివాళులర్పించారు. కలాం జీవితాన్ని విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకుని మంచి స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, స్నాక్స్ అందించారు. ఐహెచ్ఆర్‌పీసీ స్టేట్ ప్రెసిడెంట్ బాదా మోహన్, కోదండ వాసవి, తమదాల కృష్ణారెడ్డి, అభినందన్, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేటలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కారం రామన్న దొర, ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వరరావు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయినాల హరిబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, అబ్బులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డేటా సెంటర్ నిర్మించడం హర్షణీయం : ఎమ్మెల్యే

రంపచోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇకపై దేశానికి ఏఐ, డిజిటల్ సిటీ రాజధానిగా అవతరించబోతోందని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో రూ.87,500 కోట్ల భారీ పెట్టుబడులతో అతిపెద్ద డేటా సెంటర్‌ను నిర్మించడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ దూరదృష్టి, పారదర్శక విధానాలతో పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించడం వల్లే అది సాధ్యమైందన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

రాజవొమ్మంగి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం రసాభాసగా జరిగింది. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. అలాగే గ్రామాల్లో సారా ఏరులై పారుతోందని, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం మాట్లాడుతూ అమాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. గడువకుర్తి సర్పంచ్ సవిరాల చంద్రుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరెవరు సారా అమ్ముతున్నారు, ఎవరు తయారు చేస్తున్నారనే వివరాలు సచివాలయ సిబ్బంది వద్ద ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా పనులకు టెండర్లు పిలిచినప్పుడు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరావు, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, పీఏసీఎస్ ఛైర్మన్ ముప్పన కేశవ్, తదితరులు ఉన్నారు.

చింతూరులో సూపర్ జీఎస్టీ 2.0పై ర్యాలీ

చింతూరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరులో బుధవారం సూపర్ జీఎస్టీ 2.0పై ర్యాలీ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రధాన సెంటర్‌లో జీఎస్టీపై కళారూపంలో ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్, టీడీపీ మండలాధ్యక్షుడు జామాల్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక యువత శిక్షణ కేంద్రం (వైటీసీ)లో శుక్రవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన, కళాజాత ఏర్పాటు చేసినట్టు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు. కార్యక్రమానికి మండల పరిధిలోని ప్రజలు, వర్తకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

యువతీ, యువకులకు ప్యాకేజీ ఇప్పించాలని వినతి

దేవీపట్నం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పూడిపల్లి పంచాయతీ పి.గొందూరులో పునరావాస ఆర్అండ్ఆర్ కాలనీలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ప్యాకేజీ ఇప్పించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి వినతి అందించారు. నాయకులు మేడే బాపన్నదొర, మడకం చిరంజీవి, సోడే రవికుమార్, తాతి రాజేష్, మడకం రాంబాబు, నేసిక పండు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

దేవీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కారం రామన్నదొర బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

అతిథి అధ్యాపకుడి పోస్టుకి దరఖాస్తు

ఎటపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో గెస్ట్ ప్రాతిపదికన అధ్యాపకుడి పనిచేసేందుకు ఒక పోస్టు ఖాళీగా ఉందని, అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ నాగుల్‌మీరా ఓ ప్రకటనలో తెలిపారు. ఏంఎస్సీ జువాలజీ పూర్తి చేసినవారు ఈనెల 18వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు సమర్పించాలన్నారు. వివరాలకు 7382318374ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషిచేయాలి : ఎంపీపీ

రంపచోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషిచేయాలని ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, పండా కుమారితో కలిసి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖలలో మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.రాజబాబు, ఏవో పి.జయంతి, వైద్యాధికారులు రాహుల్, బి.అన్నపూర్ణ, ఎంపీటీసీ కుంజం వంశీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజావల్లి, సర్పంచులు, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం జి.కిషోర్, అధికారుల, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా నరేష్‌కుమార్

వీఆర్‌పురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం మండల టీడీపీ అధ్యక్షుడిగా బొర్రా నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు నేతలు సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు ముత్యాల సిద్ధార్థ, బొర్ర సూరి, ముత్యాల శంకరరావు, బొర్రఆదినారాయణ, ముత్యాలచంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకూరులో 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే'

రంపచోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఆయన ఆకూరు గ్రామ సచివాలయంలో 'వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఏ కె.సురేష్ రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌కు వినతి

రంపచోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని బుధవారం గిరిజన న్యాయవాదులు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. షెడ్యూల్డ్ ఏరియాలో సివిల్ కోర్టులు ఏర్పాటు చేసి పెండింగ్ కేసులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరసిక్కా ప్రఖాషరావు, న్యాయవాది పండా సిద్దార్థ , తదితరలుఱ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కలాం సేవలు మరువలేనివి

● ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



జగ్గంపేటలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయం వీధిలోని ప్రభుత్వ మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరై అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. దేశ రక్షణ శాఖకు శాస్త్రవేత్తగా చేసిన కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు కె.ఝాన్సీ లక్ష్మి, టీచర్లు వై.విజయలక్ష్మి, కె.అనిత, ఆర్‌సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.సతీష్ బాబు, కేఎస్ హరిగోపాల్ పాల్గొన్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలోని నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాలలోని అబ్దుల్ కలాం భవనంలో కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీన్ డాక్టర్ డి.కిషోర్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్‌టివివిఎస్ కుమార్ కలాం దేశానికి అందించిన సేవలు కొనియాడారు. నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): భారత దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన భారత రత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని మార్స్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అడపా దుర్గారావు అన్నారు. మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నేతృత్వంలో విద్యార్థులు ఎంఈవో కార్యాలయం వద్ద కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూర్తిమాస్టర్, కిలపర్తి రఘు, సాయితేజ, నేహరేష్మి, రత్నం, పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బాణసంచా దుకాణాల నిర్వహణలో

నిబంధనలు పాటించాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల ప్రదేశాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లో గుర్తించిన 3 ప్రదేశాలను తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం పరిశీలించారు. దుకాణాల ఏర్పాటులో దుకాణాదారులు అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దుకాణాల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారు సూచించారు. ఆర్ఐ గోపాలకృష్ణ, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన



కిర్లంపూడిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసుకునేందుకు బుధవారం తహశీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, ట్రైనీ ఎస్ఐ ఎం.రాజు, ఫైర్ ఆఫీసర్ శ్రీరాముడు స్థల పరిశీలన చేశారు. దుకాణాల ఏర్పాటు, అక్కడ తీసుకోవాల్సిన భద్రత చర్యలను వివరించారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ఈవో సుబ్బారావు, అధికారులు



ఎల్లయ్యపేటలో అవగాహన కలిగిస్తున్న దృశ్యం

అన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలపై బుధవారం సత్యదేవ జూనియర్ కళాశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డులలో ర్యాలీ కొనసాగింది. జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ వెంకట్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దీనిపై మరింతగా తెలుసుకునేందుకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు, దేవస్థానం ఏఈవో భాస్కరరావు, సూపరింటెండెంట్ యనమల అప్పారావు, పసుపులేటి రమేష్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

తొండంగి(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై బుధవారం ఎల్లయ్యపేటలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిని కార్యక్రమంలో జీఎస్టీ తగ్గింపు వల్ల మత్స్యకారులకు చేకూరిన లాభాన్ని వివరించారు. కార్యక్రమంలో కోడా అప్పలరాజు, చొక్కా కొండబాబు, ఎరిపల్లి సత్యన్నారాయణ, చొక్కా సత్యన్నారాయణ, ఎరిపల్లి గోపి, మైలపల్లి నూకరాజు, ఎంకాశీ, కారే అన్నవరం పాల్గొన్నారు.

జీఎస్టీపై నేడు తునిలో సమీక్షలు

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై కీలక సమీక్షలు గురువారం తునిలో నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గురువారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, జీఎస్టీ అధికారులతో ఎమ్మెల్యే దివ్య సమావేశం అవుతారని పేర్కొన్నారు.

మామిడి, జీడిమామిడితోటలకు సస్యరక్షణ కీలకం



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త నరసింహారావు

తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడి, జీడిమామిడితోటలో సస్యరక్షణ కీలకమని ఏరువాక కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. దొండవాక గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మామిడి, జీడిమామిడి తోటల్లో కేవలం పూత, కాయ దశల్లో కాకుండా పంట అనంతరం నుంచి సస్యరక్షణ సమగ్ర ఎరువుల యాజమాన్యం, కొమ్మల కత్తిరింపు చేపట్టినట్లు అయితే నాణ్యమైన పంట దిగుబడి పొందవచ్చని తెలిపారు. మండల ఉద్యాన అధికారిని ఎన్.సుజాత, వీహెచ్ఏలు కృష్ణాజీ, ప్రకాష్, కిరణ్, గ్రామపెద్దలు సత్యనారాయణ, అభ్యుదయ రైతులు ఉన్నారు.

ఉన్నత ప్రమాణాల వైపు అడుగులు వేయాలి

శంఖవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని బాలికలు ఉన్నత ప్రమాణాలవైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. బుధవారం కత్తిపూడి వర్తక సంఘం కల్యాణ మండపంలో రాష్ట్రీయ పోషణమాసం సందర్భంగా కత్తిపూడిలో శంఖవరం, ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మీ, మేడిశెట్టి సూర్యకిరణ్, పర్వత సురేష్, ఎంపీపీ రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు

అంతరాయం

జగ్గంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, నరేంద్రపట్నం ఫీడర్‌తో పాటు జగ్గంపేట ఇండస్ట్రియల్ ఫీడర్‌లో ఆర్‌డీఏస్ఎస్ కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. బావవరం, గొల్లలగుంట, గుర్రంపాలెం గ్రామాలకు, అక్కడి పలు బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో గురువారం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

25లోపు పంట నమోదు చేయాలి

గండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ సభలో అధికారులు మాట్లాడుతూ ప్రతి ల్యాండ్ పార్సిల్‌ను ఈ పంట నమోదులోకి తీసుకురావాలన్నారు. ప్రధాన పంటలైన వరి, పామాయిల్ పూర్తి పంట నమోదు అయినప్పటికీ మిగిలిన పంటలు పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. ఈనెల 25లోపు పంట నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జి.శ్రీనివాస్, ఎంఏవో జె.లక్ష్మి, ఏఈవో పి.చంద్రమౌళి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదానం

రౌతులపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో దుర్గాదేవి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీశ్రీనివాస వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యడ్ల బుజ్జి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

పిచ్చిమొక్కల తొలగింపు

తుని రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డి.పోలవరంలో అస్తవ్యస్థంగా మారిన పారిశుధ్య పనులపై ఇటీవల సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చింది. ఇందులో భాగంగా ఎంపీడీవో సాయి నవీన్ అపారిశుధ్యంపై దృష్టిసారించి పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలో జడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. పంచాయతీ అధికారుల చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



రీ సర్వే పనులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

రీ సర్వే పనుల పర్యవేక్షణ

జగ్గంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి రాజుపేట గ్రామంలో జరుగుతున్న రీ సర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ పనులను మంగళగిరి సర్వే అండ్ సెటిల్మెంట్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షించారు. రీ సర్వేలో ప్రతి రైతుకు 3 రోజులు ముందుగానే నోటీసులు ఇచ్చి సర్వేకు హాజరయ్యేలా చూడాలన్నారు. సంబంధిత రైతులతో మాట్లాడి రీ సర్వే ఎలా జరుగుతుందో తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కె.సూర్యారావు, తహశీల్దార్ జేవీఆర్‌రమేష్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎల్.నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అంబిక, మండల సర్వేయర్ అప్పారావు ఇతర సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యసభ ఎంపీ సతీష్‌ను కలిసిన జ్యోతుల నవీన్



సానా సతీష్‌తో జ్యోతుల నవీన్

జగ్గంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌ను కాకినాడలోని ఆయన కార్యాలయంలో బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కలిశారు. నవీన్ వెంట ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భూపాలపట్నం ప్రసాద్, తూము కుమార్ పాల్గొన్నారు.

కర్నూలు సభకు తరలిరావాలి

● ఏపీ కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సభకు రాష్ట్రంలోని కుమ్మరి శాలివాహనులు అంతా పాల్గొనాలని ఏపీ కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్ కోరారు. జిల్లాలో 4రోజుల పాటు పర్యటించి బుధవారం కోనసీమ జిల్లా పర్యటనకు వెళుతూ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి కుమ్మరి శాలివాహన వృత్తిదారులను నేరుగా కలిసి వారి సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. వారి సమస్యలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు.

19న అన్నవరంలో జనసేన సమావేశం



ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం హరిహర రిసార్ట్స్‌లో 19న సాయంత్రం జనసేన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ కోసం ఆసక్తి ఉన్న వారి వివరాలు తీసుకోవడం సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యకర్తలు గ్రామాల్లో ఎదుర్కొనే సమస్యలతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆసక్తి ఉన్న వారి వివరాలు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు తరలిరావాలని బాబి కోరారు.

పెరుమాళ్లపురంలో స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తొండంగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మై భారత్, యువజన శాఖల ఆధ్వర్యంలో బుధవారం పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో బ్లాక్‌లెవెల్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. దీనిని ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. బాలబాలికలకు విడివిడిగా కబడ్డీ, పరుగుపందెం, వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెల్పింగ్ హేండ్స్ ఛైర్మన్ చొక్కా స్వామి, మైభారత్ ఆనంద్, అధ్యాపకులు పివి కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, వైస్ ప్రిన్సిపాల్ పిదివాకరరావు పాల్గొన్నారు.

విశాఖలో డేటా సెంటర్ రాకపై హర్షం

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కృషి మేరకు ఐటీఐలో విశ్వనగరంగా విశాఖకు అవకాశం లభించడంపట్ల ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ విశాఖపట్నం కేంద్రంగా రూ.1.31లక్షల కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకురావడం ఎంతో శుభపరిణామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగాఈ ప్రాజెక్టు విశాఖపట్నంలో ఏర్పాటు కావడం రాష్ట్రానికే కాకుండా యావత్తు భారతదేశానికే గర్వకారణమని ఎమ్మెల్యే చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ప్రారంభమనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాకుండా అది రాష్ట్ర భవిష్యత్తును మార్చే చారిత్రాత్మక అవకాశమని చెప్పారు.

రహదారుల అభివృద్ధికి రూ.7.25 కోట్ల నిధుల మంజూరు

● తుని ఎమ్మెల్యే యనమల దివ్య



తుని రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ముఖ్యమైన రెండు రహదారుల అభి వృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించగా రూ.7.25 కోట్లు నిధులు మంజూరైనట్టు తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఓ ప్రకటనలో తెలిపారు. తుని, ఎన్.సూరవరం, కొట్టాం, కేఈ చెన్నయపాలెం రోడ్లను కలుపుతూ కత్తిపూడి వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేసే రోడ్డును రూ.3.50కోట్లతో, అలాగే ఎర్రకోనేరు నుంచి వేమవరం వరకు వేసే పలు రోడ్లను రూ.3.75 కోట్లతోను నిర్మించనున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా పటిష్టమైన రహదారి నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

రక్షణ కల్పించాలంటూ పోలీసులకు మహిళ ఫిర్యాదు

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తనకు, తన భూమికి రక్షణ కల్పించాలంటూ గజ్జనపూడికి చెందిన పల్లి సత్యవతి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. గజ్జనపూడి గ్రామ సమీపంలోని కె.కొత్తపల్లి వైఆర్‌సీ కాలువ పక్కన తనకు ఉన్న 30 సెంట్ల భూమిని ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తూ ఉద్దేశపూర్వకంగా తనపై దాడి చేస్తున్నారని పేర్కొంది. గతంలో తనపై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశారని పేర్కొంది. దీంతో అప్పటి నుంచి వారు తనపై కక్ష పెంచుకుని చంపేస్తామని బెదిరిస్తున్నారని తనకు రక్షణ కల్పించి చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది.

మహిళల ఆరోగ్యంపై సదస్సు

గండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజమండ్రికి చెందిన హెలియోస్ హాస్పిటల్ డాక్టర్ లలిత కంభంపాటి, ముంబైకి చెందిన ఎంఎస్‌డి ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ థెరపీ మేనేజర్ అష్రఫ్ మహమ్మద్ చావడా పాల్గొని గర్భాశయ క్యాన్సర్ టీకా ప్రాముఖ్యతను వివరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ప్రత్తిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాండవులపాలెం గ్రామానికి చెందిన గర్భిణికి బుధవారం అంబులెన్స్‌లో ప్రసవం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ సాహెబ్ భార్యకి నెలలు నిండడంతో బుధవారం నొప్పులు ప్రారంభమయ్యాయి. 108కి సమాచారం అందించడంతో బుధవారం సాయంత్రం ప్రత్తిపాడుకి బయలుదేరారు. గజ్జనపూడి గ్రామానికి చేరుకోగానే ఆమెకు నొప్పులు తీవ్రమవడంతో అంబులెన్స్‌లోనే పైలెట్ నరసింహరాజు, ఇంటి రాజవేణి డెలివరీ చేయగా, ఆడబిడ్డకి ఆమె జన్మనిచ్చింది.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామవరం గ్రామంలో అడబాల మునిసియ్య (చంటి) ఇటీవలే మృతి చెందడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి సానుభూతిని తెలిపారు.



చంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం